# కుబ్జతనమా? మానవస్వభావమా?

శ్రీ పాలగుమ్మి పద్మరాజు

అబ్బ! పాడుకోటు! ఇంత ఇరుకుగా ఉందేం? క్రితం వేసవిలో ఈ కోటు కుట్టించినతరవాత తను బాగా లావు ఎక్కాడో, లేకపోతే చాకలిబల్లమీద నలిగి ఇది కురచ అయిపోయిందో రాముడికి సరిగా జ్ఞాపకంలేదు. కోటుజేబులో పర్సూ, జేబురుమాలూ చొక్కా జేబులో వేసుకుని కోటు విసుగ్గా విప్పి బెంచీమీద పడ వేశాడు. ఆ వేసవి ఎండలో స్టేషనంతా మూర్ఛపోయి నట్టుగా ఉంది. ఏమూలో, 'సుడా అండీ! సుడా!' అంటున్నా డొకడు నీరసంగా. కొంతమంది బెంచీల మీద నిద్రపోతున్నారు. కొండపల్లి బొమ్మలవాడు ఎవరూ కొనరనే ధైర్యంచేత గోడకి జేర్లబడి కూర్చుని కునుకిపాట్లు పడుతున్నాడు. ఉశ్శ్! రైలు ఆలస్యంగా వస్తుందటకూడాను. రాముడికి చాలా చిరకుగాఉంది. చెమటవల్ల చొక్కా తడిసి కొంత చల్లగా ఉన్నా తాపంమాత్రం తగ్గలేదు. ఆస్టేషనులో మనుష్యుల సవ్వడులు నీరసంగా చాలాదూరాన్నుంచి వినబడుతూ ఉన్నట్టుగా చెవిమీద పడుతున్నాయి. ప్రపంచక మంతా మత్తుమందు పుచ్చుకున్నట్టుగా ఉంది.

చేతులో పుస్తకాలపెట్టే, చంకలో పుస్తకాల దొంతరా పెట్టుకుని, రామనాథశాస్త్రి క్రాపుగల ఒక మనిషి, రాముడివంక కొంతసేపు ఎగాదిగా చూసి, 'నావెల్సు కావాలాండి? సార్! నావెల్సు?' అని అడిగాడు. అక్కరలేదన్నట్టు తల ఊపాడు రాముడు. వెధవ నావెల్సు! చదువుకున్నవాళ్లకేం నచ్చుతాయి ఇవి? కాని నావెల్సువాడిని చూడ్డంతోటే రాముడి కేదో జ్ఞాపకంవచ్చింది. చటుకుని లేచి ప్రక్కనే ఉన్న హిగిన్ బాథమ్సు బుక్ స్టాల్ దగ్గరకు వెళ్లాడు రాముడు.

రాముడు పుస్తకాల విషయంలో అందె వేసిన చెయ్యి. పేరు చూసి, అతనికి తల ఊపడానికి తాహతు గల పుస్తకాలు లెక్కపెట్టలేం. కాని అతడు సమగ్రంగా చదివిన పుస్తకాలు చాలా తక్కువే. పుస్తకాల మీద అతడు అభిప్రాయాలు ఇచ్చేటప్పుడు మీరు వింటే, అతడు మాట్లాడే ధోరణి, పరిశీలనాదృష్టి, అతడు ఉపయోగించే పరిభాష చూసి, అతడు చదవనిపుస్తకం ప్రపంచకంమీద ఉండదని మీరు అనుకుంటారు. కాని అదే మీపొరబాటు. ఒక్క పుస్తకాల విషయంలోనే కాదు, తక్కిన అన్ని విషయాలలోనూ రాముడు అంతే.

ఆనాడు అతని అభిరుచి తెలుగు కవిత్వంమీదికి పోయింది. భారతి చేతులోకి తీసుకుని పుటలు తిరగ వేస్తున్నాడు. అందులో 'కుమార' అనే ఎవరిదో ఒక పద్యం ఉంది. పేరు చూస్తేనే అది చదవా లనిపించింది.

కుబ్జతనమా? మానవస్వభావమా?

విరులగుత్తుల పరిమళముతో
విరియబూచిన ప్రకృతియంతా
కలకలనెనే—నీనవ్వుల
పులకరింపులతో—

భూనభంబుల కలిపి కట్టిన
భూరిసౌధాంగణము లన్నీ
భోరుమనెనే—నీ నవ్వుల
మారు మ్రోతలతో—

ఆ సుదూరపు ఆకసంలో
అవులించిన నీలిలోతులు
నిండిపోయెనె—నీ నవ్వుల
పండు వెన్నెలతో—
సీమసీమల నిద్రపోయిన
జీవచైతన్యంబు మేల్కని
పరుగులెత్తెనె – నీ నవ్వుల
తరళవేగముతో—

ఒక్కసారి ప్రపంచకమంతా మేలుకుంది. మన్ను తిన్నపాములా పడుకున్న అతని ఉద్రేకం ఉవ్వెత్తుగా లేచింది. ఈభావం అతనికి చాలా పరిచితమయినదే. ఎక్కడన్నా ఇదివరకు చదివాడా? కాదుకాదు. ఇది తన మనస్సులోనిదే. చాలాకాలంనుంచి మోస్తూ ఉన్న బరువు ఒక్కసారిగా దిగిపోయినట్టు అనిపించిం దతనికి. రేడియోతరంగాల మాదిరిగానే భావతరంగాలు కూడా మనస్సునుంచి వ్యాపిస్తాయిగావును; లేకపోతే ఈ భావ సారూప్యానికి అర్థం అతనికి కనిపించలేదు. అతడూ కొంతవరకు కవే. అప్పుడప్పుడు పద్యాలు వ్రాస్తూ ఉంటాడు. కాని ఆ పద్యాలు కేవలం తన వ్యక్తిగతి మయిన అనుభవాలకి సంబంధించినవి అవడంచేతనూ, వాటిలోని అంతరార్థం ఇతరులు గ్రహించలేరేమోననే సంకోచం చేతనూ, వాటిని ఇంతవరకూ పత్రికలకు పంపలేదు. చిత్రం! ఈ పద్యంకూడా కేవలం తన వ్యక్తికి సంబంధించినదే! పత్రికలో పడడంతోటే ఇది అనంతమయిన ప్రపంచానుభవంగా మారిపోయింది. అసలు అన్ని అనుభవాలూ అంతేనేమో! దీనినిబట్టిచూస్తే తన పద్యాలనన్నింటినీ పత్రికలకు పంపవచ్చు.

రైలు 'కైంయి' మని కూసింది.

రాముడు అదరిపడి వెనక్కి తిరిగి చూశాడు. రైలు కదులుతూఉంది. అరే! రైలు వచ్చి ఆగినజాడే చూడలే దతను. చేతులో భారతి అక్కడే పడవేసి తొందరగా పరుగెత్తాడు. అదృష్టవశాత్తు ఇంటరు తరగతిపెట్టె ఎదురుగానే కనబడింది. ఎల్లాగో తలుపు త్రోసుకుని లోపలికి దూరాడు. వెంటనే బెంచీమీద మరచిపోయిన కోటుసంగతి జ్ఞాపకం వచ్చింది. రైలు ప్లాటుఫారం దాటిపోయింది. అతడు తన పరధ్యానాన్ని నిందించుకున్నాడు. 'సరే! ఏం జేస్తాం?' అనుకుని కూర్చున్నాడు. జేబురుమాలూ, పర్సూ, చొక్కాజేబులో వేసుకున్నాడుగాని లేకపోతే మరీ అభాసయిపోను. మొగంమీద చెమట తుడుచుకుని, దడదడ కొట్టుకుంటూ ఉన్న గుండెలసద్దు అడచడానికి ప్రయత్నిస్తున్నాడు.

'కుఱ్ఱతనమా? మాశవస్వభావమా?' - తనలో తను నవ్వుకున్నాడు.

ఇంతలో ఏవో రెండు కళ్లు తన వెనకనుంచి తదేకదీక్షతో తనవైపే చూస్తూ ఉన్నట్టు అనిపించిం దతనికి. వెనక్కి తిరిగి చూశాడు. తను కూర్చున్న సీటుమీదనే ఒక యువతి కూడా కూర్చుని ఉంది. పెట్టెలో ఇం కెవరూ లేరు. ఆలోచించుకోకుండానే అతడు లేచి ఎదురుగా ఉన్న సీటుమీదికి పోయి కూర్చున్నాడు. అతనిదృష్టి తనమీద పడడంతోటే ఆమె తన చూపులు ప్రక్కకు తిప్పి కిటికీలోనుంచి అవతలకి చూస్తూ కూర్చుంది. అతడు వెఱ్ఱివానిలా ఆమెవంకే తెల్లబోయి చూస్తున్నాడు. ఆ చూపులకు చలనం లేదు. పెట్టెలో ఇం కొకయువతి ఉంటుందని అతడు అనుమానించనయినా లేదు! ఆమె మళ్లీ సన్నగా తన చూపులను అతనివైపు తిప్పి అతడు తనవంకే చూస్తూ ఉండడంచేత వెంటనే ముఖం తిప్పుకుని మొదటివలె కిటికీవంక చూస్తూ ఉంది. ఆమె చెక్కులు కొంచెం ఎఱ్ఱబడ్డాయి. ఆమె తనవంక తిరిగి చూడడంతోటే అతనికి చైతన్యం కలిగింది. ఎల్లాగో క్షమార్పణ చెప్పాలనుకున్నాడుగాని ఏమి చెప్పాలో అతనికి తోచలేదు.

'ఇది...ఇది...ఇది ఆడవారిపెట్టా?' అన్నాడు కంగారుగా.

'కాదు.' ఆమె కిటికీకి దగ్గరగా జరిగింది.

అతని మనస్సు కొంత కుదుటబడింది. కాని ఆమెకు కేవలం ఎదురుగా కూర్చుని ఉన్నమూలంగా, ఒకవిధమయిన ఆందోళన కలిగింది అతనికి. తన దుస్తులవంక చూసుకున్నాడు. పంట్లాంమడత నలిగిపోలేదు. తెల్లని మల్లిపువ్వులాంటిచొక్కా నిజంగా అందంగానే ఉంది. చొక్కా పంట్లాంలోపలికి ఉంది. అంతవరకూ బాగానే ఉంది. కాని కోటులేకపోవడం చాలా వెలితిగా కనబడింది. దాన్నిగురించి ఆమెకు చెప్పకపోతే వీలులేదనుకున్నాడు. నాగరకలక్షణాలలో గలిగిన ఈ లోపం క్షమించడానికి వీలులేనిది. తననుగురించి ఆమె ఏమనుకుంటోందో!

'నే నింత పెకిలితనంగా రైలు ఎక్కడం చూస్తే మీకు నవ్వువస్తోందేమో!' అని అతడు తనంతటనే నవ్వడానికి ప్రయత్నించాడు. ఆమెముఖం కొంచెం ఎఱ్ఱ

బారింది. వచ్చేనవ్వుని బలవంతంగా ఆపుకుని, ఆమె కిటికీకి దగ్గరగా జరిగి, కిటికీమీద గడ్డం ఆనుకుని బయటకు చూస్తూఉంది.

'ఏకో పరధ్యాన్నంగా స్టేషనులో పుస్తకాలు చూస్తూ నిలబడ్డాను. రైలు వచ్చి ఆగినసడే నాకు వినబడలేదు. కదిలేటప్పుడు కూత వినబడింది. బల్లమీద పడవేసినకోటు మరిచిపోయి గబగబా ఎల్లాగయితేఏమి రైలు ఎక్కాను' అన్నాడు. మాట్లాడేటప్పుడు మాత్రం ఆమె తనవైపు చూడకపోయినా, అతడామెవైపు చూడకుండా ఉండలేక పోయాడు

ఆమెప్రత్యక్షంలో అతడు తన స్వభావసిద్ధమయిన మనస్థైర్యాన్ని నిలబెట్టుకో లేకపోయాడు. తన స్వరూపచలనాదులలో వైకల్యం ఏమన్నా ఉందేమోనని అతనికి పూర్తిగా అనుమానం.

ఎల్లాగయినా ఆమెతో మాట్లాడాలని కోరికఅతనికున్నా, సంభాషణ ఎల్లా మొదలుపెట్టాలో అతనికి తెలియలేదు. కాని వారిద్దరిమధ్యా ఆమౌనం, కేవలం మౌనంగా లేదు. ఏవో అస్పష్టప్రవాహాలు ఇటూ అటూ ప్రవహిస్తూనేఉన్నాయి. ఆరైలుపెట్టెలో ప్రతిఅణువూ సజీవంగా సంచలిస్తూఉంది. అంత సజీవమయిన వాతావరణం అతన్ని ఆవరించడం, అతని కింతవరకూ అనుభవంలోకి రాలేదు. అందులో అతడు ఉక్కిరిబిక్కిరయిపోతున్నాడు. అల్లా ఉక్కిరిబిక్కిరి అవడంలో ఎంతో కులాసా, మైకం ఉన్నాయి.

ఆమె నాజూకుయొక్క అవతారం. ఆనాజూకులో దౌర్బల్యం ఏమీలేదు. ఆమె అంగసౌష్ఠవం పరిపూర్ణం. నల్లనేలలో మొలిచిన బీరపాదులా ఉంది ఆమె. తనకాలేజీఆడపిల్లలలో అంతపొంకం ఎవరికీలేదు. సున్నితమయిన ఆమె శరీరపు మృదుత్వంలో అపూర్వమయిన శక్తి ఉంది. ముట్టుకుంటే వాడిపోయే సౌకుమార్యంకాదు ఆమెది. ఆమె అనుక్షణం ఎదుగుతూనే ఉంది. రాముడికళ్లకి ఆ ఎదగడం కనబడుతూనే ఉంది. గాలితాకుడుకి పులకరించే నవకం ఆమెది.

'ఆమె తనువున పులక లఖిలదిక్కోణాల
గాలికెరటాలపై కదలి వ్యాపించినవి!'

ఆమెను చూస్తేనే కవిత్వం పుట్టుకువస్తుంది! ఈపద్యం తను ఇదివరకు వ్రాసిందా? కాదు. అప్పటికప్పుడు అకస్మాత్తుగా తన భావనలో పుట్టిందే. ఇదే నిజమయిన కవిత్వం.

ఈమాటు నిజంగానే గాలి పులకరించింది.

ఆమె ఒకసారి లేచింది. లేవడంతోటే చీర బిరబిర లాడింది. ఆమెచుట్టూ ప్రదేశం అంతా ఒకసారి జలదరించింది. పైటచెరగు సరిగా మోకాళ్లపైనుంచి తీసుకుని చేతిలో పుస్తకం ప్రక్కని బల్లమీద పెట్టి మళ్లీ కూర్చుంది.

అతని హృదయంలో ఎవరో గిలిగింతలు పెట్టారు. ఆమెపొంకాన్ని చూసి, అతనిలో ఉద్వేగం ఉవ్వెత్తుగా లేచింది. ఆమె కూర్చోగానే అతని గాబరా కొంత తగ్గింది.

'ఏదండీ! ఆపుస్తకం చూసి ఇస్తాను' అని అడిగాడు.

ఆమె ఆ పుస్తకాన్ని అతడు కూర్చున్నబల్లమీదికి గిరవేసింది. అది తీసుకుని మొదటిపేజీ విప్పాడు. ఆమెపేరు దానిమీద ఉంటుం దనుకున్నాడు కాని అతనిఆశ విఫలమయింది. పేరు ఆమెనే అడుగుదా మనుకున్నాడుగాని ధైర్యం చాలిందిగాదు. 'ఆఁ! పేరులో ఏముంది?' అనుకుని చివరకి సమాధానపడ్డాడు.

పుస్తకం ఒక ఇంగ్లీషుపద్య సంగ్రహం. ఇంటరు మీడియేటుకి అది ఆ ఏడు పెట్టారు. ఆమె ఎక్కడో ఇంటరు చదువుతూ ఉండి ఉంటుం దని అనుకున్నాడు.

'మీకు కవిత్వంలో ఏమన్నా అభిరుచిఉందా?' అని అడిగాడు. ఆ ప్రశ్న అంతసహజంగా గాని సందర్భానికి తగినట్టుగా గాని లేదని అతనికే అనిపించింది.

'నేను వ్రాయలేనుగాని కవిత్వమంటే నాకు ఇష్టమే.'

ఆమెసన్నని కంఠస్వరం సంగీతంలా మ్రోగింది. అది ఈ ప్రపంచకాన్నుంచి రాలేదు. దిబ్మండలానికి అవతలప్రక్కనుంచి ఏగంధర్వగాన శ్రుతులో అతనిచెవుల్లో మ్రోగినట్టుగా అనుకున్నా డతడు.

'నా అభిమానకవి మేస్‌ఫీల్డు' అన్నాడు పుస్తకంలో పేజీలు తిరగవేస్తూను.

ఈసారి ఆమె చిఱునవ్వుని ఆపుకోలేకపోయింది.

'మీరు ఏ కాలేజీలో చదువుతున్నారు ?' అని ముఖమెత్తి కొంచెం ఆమెవంక చూశాడు. ఆమె చిఱునవ్వు కొంత అతన్ని తలక్రిందుచేసింది. ఇందాకటిపద్యం అతనికి అప్రయత్నంగా జ్ఞాపకం వచ్చింది.

'సీమసీమల నిద్రవోయిన
జీవచైతన్యంబు మేల్కొని
పరుగులెత్తెనె — నీ నవ్వుల
తరళవేగముతో —'

'వుఱ్ఱూతలమా ? మానవస్వభావమా ?' అతనికే నవ్వువచ్చింది.

'కాకినాడకాలేజీలో' నని ఆమె చెప్పిన సమాధానం అతడు వినిపించుకోలేదు.

'మన ఆధునిక ఆంధ్రకవిత్వంలో కొన్ని లోపాలు లేకపోలేదు.' తను ఈ అభిప్రాయం ఇవ్వడం అనవసరమేమోనని వెంటనే అనుకున్నాడు.

'మీరు కవిత్వం వ్రాస్తారా !' ఆమె కిటికీ వంక తిరిగి ప్రశ్నించింది.

అతడు తెచ్చిపెట్టుకున్న చిఱునవ్వులో కొంత వెకిలితనం లేకపోలేదు. 'కొంచెం వ్రాస్తానుగాని పత్రికలకు పంపలేదు.'

ఆమె ఇంకేమీ మాట్లాడలేదు. తమ సంభాషణ అంతటితో అర్థంలేని ముగింపుకురావడం అతనికి ఇష్టంలేదు. మళ్లీ ప్రశ్నించాడు. 'భావకవిత్వంమీద మీ అభిప్రాయం ఏమిటి ?'

'నేను చదివింది చాలా తక్కువ. చాలామట్టుకు నాకేమీ అర్థం గాదు.'

రాముడికి కొంత సంభాషణకి అవకాశం దొరికింది. తన సహజధోరణిలో మొదలుపెట్టాడు. 'మీకు సానుభూతి ఉంటే అర్థం గాకపోదు. మీరు కవియొక్క అనుభవంలోకి వెళ్లడానికి ప్రయత్నించాలి. కాని మన ప్రబంధాలలో కవిత్వాన్ని అర్థంచేసుకున్నట్టుగా దీనిని మీరు అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తే మీ ప్రయత్నం విఫలమయిపోతుంది.'

'ఇంగ్లీషు కవిత్వంలో ఆ బాధ ఎందుకు రాదు? వ్రాసేవారిలోకూడా ఉంటుందనుకుంటాను.'

'నిజమే ! వ్రాసేవారిలో గొప్పతనాన్నిబట్టే కవిత్వానికి ప్రసాదగుణం ఉంటుంది. కాని తెలుగులో ఈ కొత్తకవిత్వం మొదలుపెట్టి ఎక్కువ రోజులు కాలేదు. ఇంగ్లీషుకవుల ధోరణిలో ఆలోచించడం మనకి అలవాటయిపోయింది. అందువల్ల ఇంగ్లీషుకవిత్వం అర్థంచేసుకోవడంలో మనకంత కష్టం ఏమీ ఉండదు. కళకి పరిభాష ముఖ్యం. అది నిర్మించుకోడానికి కొంతకాలం పడుతుంది. అది ప్రజలు గ్రహించగలగడానికి ఇంకా కొంతకాలం పడుతుంది.

ఆమె దీనికి జవాబుగా కిటికీవంక తిరిగి నవ్వుతూ కూర్చుని ఉంది.

కొంత తన చేష్టలలో వెకలితనం ఉన్నా సంభాషణలోమాత్రం పైచెయ్యి తనదేననుకున్నాడు రాముడు. తన వాగ్ధోరణిమీద అతనికి మంచి ధైర్యం, నమ్మకం ఉన్నాయి. కాని ఆమె సంభాషణకి తావు ఇవ్వడంలేదు. ఆమె తనతో మాట్లాడ్డానికి సంకోచిస్తూ ఉందా? లేక మాట్లాడ్డం ఇష్టంలేక మాట్లాడ్డం లేదా ?

పుస్తకంలో పేజీలు తిరగవేస్తున్నాడుగాని ఒక్క అక్షరమయినా అతడు ఆనవాలు పట్టడంలేదు మనస్సులో అర్థంలేని ఆందోళన. అతనిచుట్టూ వాతావరణం అతనిమీద అపరిమితమయిన ఒత్తిడిచేస్తూ ఉంది. అతని మనస్సు ఆ ఒత్తిడిలో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. వేసవి ఎండ అతనికి జ్ఞప్తిలో లేనేలేదు. అసలు తను రైలులో ఉన్నట్టుగాని, రైలు ఇప్పుడే తాడేపల్లిగూడెం దాటినట్టుగాని అతనికి గుర్తులేదు. ఆమె తనకు అంత దగ్గరగా ఉన్నా వారిద్దరిమధ్యా కొన్ని సముద్రాలున్నాయి, ఆ సముద్రాల నతడు ఈదడానికి ప్రయత్నిస్తున్నాడు.

పై వేసవి ఎండ అతన్ని ఎంతమాత్రం బాధించడంలేదు. అసలు ఆసంగతే మరచిపోయాడు అతడు. ఎక్కడో అంతులేని వసంత ఋతువులో, ఆకులు పండి రాలని ఆరామసీమల్లో, తీగలతో పెనగొన్న భూరుహచ్ఛాయలలో పువ్వులతో దిండ్లు అమర్చబడిన

చూసుకుంటున్నట్లు ఉయ్యాలలలో 'తనకున్న ప్రాణము ప్రాణమైన చెలి' ప్రక్కని కూర్చుండగా ఊపుడూపులోనూ స్వర్గాన్ని అందుకుంటూ, డోలికా సౌఖ్యాన్ని అనుభవిస్తున్నాడు. అప్పుడతని మనస్సులో ఉన్నవి, మంచి గంధాలూ, మల్లెపువ్వుల చల్లతావులూ, కోయిలకల గానాలు, మంచినీటి చుక్కలూ, తళతళ మెరసే పచ్చికలూ, మందమలయానిలాలూ, పండు వెన్నెల్లూ, ఇంకా ఇల్లాంటివి ఎన్నో, ఎన్నో.

రైలు దీర్ఘంగా కూతవేస్తూ ఆగింది నిడదవోలు ప్లాటుఫారంమీద. ఆమె తొందరగా లేచి బల్లమీదిపెట్టె దింపుకోబోతోంది.

అప్పుడే ఆమె దిగిపోవడమే? అసంభవం! అసంభవం! ఇంత...ఇంత...ఇంక అతనికి ఆలోచన కూడా పోలేదు.

అతని కాసందర్భంలో ఏమిచెయ్యాలో బోధపడలేదు. ఆమె కూలివాడిని పిలవకముందే ఆమె సామానులు దింపి క్రిందపెట్టాడు. ఆమె వద్దని ఒకటి రెండుసార్లు అందిగాని అతన్ని ఆపగలిగేటంత గట్టిగానూ నిర్మొగమాటంగానూ చెప్పలేకపోయింది. ఆసామాన్లనతడు చాలా సున్నితంగా ముట్టుకున్నాడు. ఆమె సామాన్లకు కూడా ఆమె మృదుత్వం ఉంటుందనే అతడనుకున్నాడు. అతనిధోరణి చూసి ఆమె ఇంకో ప్రక్కకు తిరిగి చిఱునవ్వుకుంది.

ఆమె దిగిపోయింది. రైలు ఆమె లేకుండనే కదలిపోయింది.

వేసవిఉక్క మళ్లీ ప్రారంభమయింది. బూట్సు కాళ్లని నలిపివేస్తున్నాయి. గబగబా విప్పి అల్లా ప్రక్కకు పారవేశాడు. కాళ్లకి కొంచెం గాలి తగలడంతోటే ప్రాణం లేచివచ్చింది. అమ్మయ్య! కాని మళ్లీ మొదటి నీరసమే. ప్రపంచకం మళ్లీ నిద్రపోతూ ఉంది.

'ఆమెవెంటనె బోయె నానంద మంతయును.'

తనెప్పుడో వ్రాసినపద్యం జ్ఞాపకం వచ్చింది.

కాళ్లు ఎదురుగా ఉన్న బల్లమీదికి జాపుకుని వెనక్కి కొంచెం జేర్లబడ్డాడు. బండి వేగంగా పోతూ ఉండడంచేత బాగా శరీరానికి గాలి తగులుతూ ఉంది. ఈ వేసవినీరసంలోనుంచి మళ్లీ అతనిలో వెనకటి ఆలోచనలు పుట్టుకొచ్చాయి.

'నా బరువు కౌగిలోన స్వప్నములు మొలిచె,
దుఃఖభారములోన మాధుర్యమొదవె,'

ఇదీ తను వ్రాసిందే! ఏ నాటివో ఈ పద్యాలు! ఈ పరిస్థితికి అవి ఎంత బాగా సరిపోతున్నాయి! ఈ పద్యాలు వ్రాసినప్పుడు తనకు ఈ అనుభవం ఉందా? ఏమో. అసలు ఏసందర్భంలో వ్రాసినవో ఈపద్యాలు! అతనికి స గా జ్ఞాపకం లేదు.

ఆమె అసలు ఎవరో? ఏ ఊరునుంచి వస్తూ ఉందో? ఏ బెజవాడనుంచో వస్తూఉండి ఉంటుంది. తను ఏలూరులో ఎక్కాడుగా మరి. తను ఎక్కేసరికే ఆమె రైలులో ఉంది. అరెరే! అడగడం మరచిపోయాడు. ఆమె నిడదవోలులో మారి ఒకవేళ నరసాపురంరైలులో ఎక్కిఉంటదుగదా!

అదీ సంభవమే. పోనీ ఆమె ఎక్కడకు పోతేనేమాత్రం ఏమి? ఆమెపేరయినా అడగవలసింది. ఏదీ, ఇంత తొందరగా దిగిపోతుం దని అనుకోలేదు.

మళ్లీ ఆమెనెప్పుడయినా కలుసుకోగలుగుతాడా?

కలుసుకోలేకపోవడమేమి? తప్పకుండా కలుసుకుంటాడు. రోజూ కలుసుకుంటాడు ఆమాటకొస్తే. తలపైకెత్తి ఆలోచిస్తున్నాడు.

ఆమె రోజూ ఆదారినే, ఆరైలులోనే వస్తూ ఉంటుందట. ఆపెట్టెలో తను ఏలూరులో ఎక్కేసరికి ఆమె ఆ పెట్టెలోనే ఉంటుందట. రోజూ ఆమెకారైలులో ఆవేళకే రావలసిన అవసరం ఏమి ఉంటుందో అతని కక్కరలేదు. తను రోజూ ఎలూరు ఎందుకు వెడతాడో అంతకంటె అవసరం లేదు. తనూ ఆమెఏలూరునుంచినిడదవోలుదాకా కలిసి, ఆపెట్టెలోనే ఇంకెవరూ జనం లేకుండా వస్తూఉంటారు అంతే. రెండురోజులవరకూ ఆట్టే పరిచయంగాదు. మూడోనాడు అతడు ధైర్యం చేసి ఏదో మాట్లాడిస్తాడు. ఆమె మామూలుకంటే కొంచెం చనవుగానే జవాబు చెపుతుంది. ఆనాటి వారి సంభాషణలో చాలావిషయాలు దొర్లిపోతాయట. తన ఊరు కొవ్వూరని ఆమె నొకసారి తప్పకుండా రమ్మం

టాడు. ఆమె వీలులేదని మృదువుగానే చెపుతుంది. వారి ఆశయాలన్నీ ఒకటే! వారిద్దరికీ పరిచయం చాలా తక్కువ అయినా వారిద్దరూ పరస్పరం కొన్ని శతాబ్దాల నుంచి ఎరుగుదురు. తన కవిత్వమంతా ఆమెకు చదివి వినిపిస్తాడు. ఆమె ఆశ్చర్యపోతుంది. ఇటువంటి కవిత్వం ఇంతవరకూ ప్రపంచకంలో పుట్టలేదంటుంది. ఆహాగత్త తనను సంతోష పెట్టడానికి ఉద్దేశించబడినా, తన కవిత్వాన్ని ప్రపంచకంలో ఎవరయినా అర్థం చేసుకో గలిగితే, ఆమె ఒక్కత్తే అర్థంచేసుకో గలుగుతుంది.

నాలుగోనాడు ఆమెను కొవ్వూరు రమ్మంటాడు. ఆమె వెంటనే తొందరగా 'ఓ వీల్లేదు. క్షమించండి' అంటుంది. నిడదవోలుస్టేషను వచ్చేదాకా మామూలుసంభాషణే. కాని ఆమె మామూలుగా నిడదవోలులో దిగదు. ఇంక పైకి ఎక్కడికి వెడుతుందా, అనుకుంటాడు. కొవ్వూరుస్టేషను వస్తుంది. అతడు దిగుతాడు. ఆమెనుకూడా దిగమంటాడు. ఆమె దిగనంటుంది. పోనీ ఒక సోడా అయినా త్రాగమంటాడు. సరేనంటుంది. సోడా పావుగంట త్రాగుతుంది. రైలు కదలిపోతుందేమోనన్న తొందర ఆమెకు ఉండదు. రైలు కూత వేసి కదలిపోతుంది. రాముడు కంగారు పడుతూ 'అయ్యో! రైలులో సామానవ్వా దింపలేదే' అంటాడు.

'ఈవేళ నేనేమీ సామాను తీసుకురాలేదు' అంటుంది ఆమె. ఆమెముఖంవంక తీక్ష్ణంగా చూస్తాడు. ఆమె చిఱునవ్వు నవ్వుతుంది. అతనికీ నవ్వువస్తుంది. ఆమె నిజంగా తనతో కొవ్వూరు రావాలని ముందే నిశ్చయించుకున్నట్టు అంతవరకూ అతడు గ్రహించలేకపోతాడు.

ఇద్దరూ రైలుగట్టువెంబడి గోదావరి రైలువంతెనదాకా పోతారు. వంతెనక్రింద ఇసుక తిప్పమీద ఎవరూ లేనిచోటికి పోయి కూర్చుంటారు. గోదావరి మీదినుంచి చల్లనిగాలి వీస్తూ ఉంటుంది. సాయంకాలమయింది. ఎండవేడిమి తగ్గిపోయింది. రెల్లు దుబ్బులు హుషారుగా తలలు ఆడిస్తూ ఉంటాయి.

ఇద్దరికీ ఏమి మాట్లాడ్డానికీ, ఏమీ తోచదు. ఎవరి ఆలోచనలు వారి మనస్సులోనే అల్లుకుపోతూ ఉంటాయి. 'రోజూ అంత చనవుగా మాట్లాడుకునే వాళ్లం గదా, ఇప్పుడు మాటలే తోచవేం?' అనుకుంటా డతడు. ఆమెకు కొంచెం దగ్గరగా జరుగుతాడు. ఆమెదేహం కొద్దిగా అతనికి తగులుతుంది.

అతనితల దిమ్మెక్కిపోతుంది. శరీరం ముచ్చెమటలూ పోశాయి. చేతులతో తల ఒకసారి తడుముకున్నాడు.

తనతల వెనకబల్లకి ఠంగుమని తగిలినట్టు క్రమంగా అతనికి తెలిసింది. లేచి సరిగా కూర్చున్నాడు. రైలు వెనక్కి ఒకసంజుగుంజి నెమ్మదిగా సాగుతూ ఉంది. ఒక్కసారి ఆవులించి ఒళ్లు విరుచుకుంటూ పెట్టె తలుపు దగ్గరకు వచ్చాడు. స్టేషనులో దీపంమీద 'కొవ్వూరు' అని అస్పష్టంగా కనబడింది. కళ్లు నులుపుకుని మళ్లీ చూశాడు.

కొవ్వూరే !

అరరే ! ఏమిటీ ఈ పరధ్యాన్నం ? పెట్టెతలుపు ఎల్లా తెరిచాడో అతనికే తెలియదు. కంగారుగా మెట్లమీద ఒకఅడుగువేసి క్రిందికి దూకాడు. రైలుకదులుతూ ఉన్నమూలంగా ముందరకు బోర్లపడ్డాడు. మోకాళ్లకు కొంచెం దెబ్బతగిలింది. లేచి దులుపుకున్నాడు. పంట్లాం మడతమాత్రం నలిగిపోలేదు! స్టేషను దాటి తొందరగా ఇంటికి పోవా లనుకున్నాడు.

రెండడుగులు వెయ్యడంతోటే కాళ్లు తేలికగా ఉన్నాయి. చూసుకుంటే కాళ్లకి బూట్సు లేవు. వెంటనే రైలువంక చూశాడు. రైలు ప్లాటుఫారం దాటి ముందుకు పోయింది. కొంతసేపటివరకూ అతనికే ఆలోచనా పోలేదు. దుస్తుల వంకచూసుకున్నాడు. ఇంక చొక్కా పంట్లాంలోపలికి ఉండడంలో అర్థంలేదనుకున్నాడు. పైకి తీసివేశాడు. 'ఛీ ! బయలుదేరినవేళ మంచిది కాదు' అనుకున్నాడు. అప్పు డతనికి జ్ఞాపకం వచ్చింది.

'కుఱ్ఱతనమా ? మానవస్వభావమా !'
అతడు పకపకమని పైకే నవ్వుకున్నాడు.